క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

కొందుర్గు: మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డుపైకి మురుగునీరు చేరి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై స్పందించిన అధికారులు శనివారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఎంపీఓ లాలయ్య రోడ్డు పక్క నుంచి కాల్వ తవ్వించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించామని, ఆర్‌అండ్‌బీ అధికారులకు నివేదించి రోడ్డుకు పూర్తిస్థాయి మరమ్మతులు నిర్వహిస్తామన్నారు.

సొంత నిధులతో రోడ్డు పనులు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దయాకర్, గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని రామన్నగూడ నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ఆ గ్రామానికి చెందిన పి.దయాకర్ తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొందుర్గు: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వనంపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలంగించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ హాజరై గ్రామస్తులతో మానవహారం చేయించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు.

రేపు విద్యార్థులకు క్రీడాపోటీలు

షాద్‌నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 30న పట్టణంలోని మినీ స్టేడియంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కొత్తూరు,నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీ, గురుకుల, మైనార్టీ, పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలతో పాటుగా షాట్‌పుట్, డిస్కస్ త్రో, పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పోటీల్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొననున్నారని, పోటీలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం

- ఓటరు తుది జాబితా విడుదల
- ఎంపీడీఓ, జీపీ కార్యాలయాల్లో లిస్టుల ప్రదర్శన
- 153 గ్రామ పంచాయతీలు 1340 వార్డులు
- షాద్‌నగర్‌లోని ఆరు మండలాల్లో మొత్తం ఓటర్లు 1,77,016



ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో తుది జాబితా విడుదల చేస్తున్న అధికారులు

షాద్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు తుది ఓటరు జాబితాను శనివారం విడుదల చేశారు. పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిశీలించిన తర్వాత తుది జాబితాను ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు ప్రదర్శించారు. అయితే షాద్‌నగర్ నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలు మినహా ఆరు మండలాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

మహిళా ఓటర్లే అధికం

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 153 గ్రామ పంచాయతీల్లో 1340 వార్డులు ఉన్నాయి. అందులో మొత్తం పురుషులు 88,435 మంది ఓటర్లు, మహిళా ఓటర్లు 88,570 మంది, ఇతరులు 11 మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, నందిగామ మండలాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

ఇంటింటి సర్వే చేసి

గ్రామ పంచాయతీల్లో అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకొని తుది జాబితాను రూపొందించారు.గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈనెల 13న విడుదల చేశారు. ఈ ముసాయిదా జాబితాపై అభ్యంతరాల ను అధికారులు ఈనెల 21 వరకు స్వీకరించారు. అయితే అభ్యంతరాలను స్వీకరించిన అధికారులు గ్రామాల్లో ఇంటింటి సర్వేను నిర్వహించారు. గ్రామాల్లో నివసించని వారి పేర్లు, వివాహం చేసుకొని వెళ్లిన వారి పేర్లు, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు.

షాద్‌నగర్ నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు
ఫరూఖ్‌నగర్	47	410	24,883	24,997	3
కొత్తూరు	12	110	8,162	8,019	1
నందిగామ	19	170	13,409	13,460	2
కేశంపేట	29	260	17,848	18,013	1
కొందుర్గు	22	186	11,474	11,695	0
చౌదరిగూడ	24	204	12,659	12,386	4
మొత్తం	153	1,340	88,435	88,570	11

ఐకమత్యంతో పరిష్కరించుకుందాం

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడూ ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు కలిసికట్టుగా పనిచేసుకుందామని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య పేర్కొన్నారు. శనివారం హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఎస్‌టీఎఫ్ మండల నూతన కమిటీ ఏర్పాటుకు ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులను మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. సంఘాల ఏర్పాటుతో ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలను పరిష్కరించుకోగలుగుతామని సూచించారు. ఈ సందర్భంగా కమిటీ మండల అధ్యక్షుడిగా సుధాకర్, గౌరవ అధ్యక్షుడిగా బి.రమేశ్, ప్రధాన కార్యదర్శిగా సి.వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా దిలీప్‌సింగ్, మహిళా అధ్యక్షురాలిగా సుజిత, మహిళా ఉపాధ్యక్షురాలుగా విజయలక్ష్మి, కోశాధికారిగా వి.సంతోష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా పరమేశ్వర్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వి.జనార్ధన్‌చారి, గోపాల్, లక్ష్మినారాయణ, బాల్‌రాజు, రాంచంద్రయ్య, జి.రాంచందర్, మహేందర్, విఠల్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంటలో చీడపీడలను నివారించాలి

రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

కొత్తూరు: పత్తి పంటను ఆశించే చీడపీడలను సాధ్యమైనంత త్వరగా నివారించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు సూచించారు. ఇందులో భాగంగా శనివారం వారు దత్తత తీసుకున్న మండలంలోని మల్లాపూర్ పంచాయతీ రెడ్డిపాలెం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ.. దిగుబడి దశలో ఉన్న పత్తికి ప్రస్తుతం రసం పీల్చే పురుగులు, ఆకులు ముడతలు పడడంతో పాటు పలు తెగుళ్లను గుర్తించినట్లు తెలిపారు. వీటి నివారణకు రైతులకు వ్యవసాయ అధికారుల సూచన మేరకు మందులు పిచికారీ చేయడంతో పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు రైతులతో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. రుణమాఫీ అందని వారు మరోమారు వ్యవసాయ అధికారుల సాయంతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్, ఏడీఏ రాజారత్నం, ఏఈ గోపాల్, ఏఈవోలు నిఖిత, దీపిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపాలెంలో పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఆలయ కమిటీ సభ్యులకు జమ్మిమొక్కను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కేశంపేట: హిందూ సంస్కృతితో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్ అన్నారు. గుడి గుడికో జమ్మిచెట్టు కార్యక్రమాన్ని గ్రీన్ ఛాలెంజ్ ఫౌండేషన్ అధ్వర్యంలో మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని దేవాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జమ్మిచెట్టు అంతరించిపోతోందని గుర్తించి గతంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి జమ్మిచెట్టు మొక్కలను పెంచినట్టు తెలిపారు. పర్యావరణంను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. హిందూ సంప్రదాయంలో జమ్మిచెట్టుకు ప్రత్యేకస్థానం ఉందని, ఆ చెట్టుకు పూజలు చేస్తే మంచి జరుగుతుందని హిందువుల విశ్వాసమన్నారు. పార్టీలకతీతంగా పర్యావరణ పరిరక్షణకు అందరూ ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యులు రాంబాల్‌నాయక్, వెంకన్నయాదవ్, ఆంజనేయులు, సురేశ్‌యాదవ్, జమాల్‌ఖాన్, ప్రేమ్‌కుమార్, శ్రీహరియాదవ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మహిళలకు నాటుకోళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే

కేశంపేట: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళాశక్తి కార్యక్రమాల ప్రణాళికలో భాగంగా మండల సమాఖ్య మండల పరిధిలోని సంగెం గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మహిళా సంఘాల సభ్యులకు నాటుకోళ్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాటుకోళ్ల పెంపకంతో గ్రామాల్లో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందించే సహకారంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి

మండలంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసిమెలసి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నాయకుల మధ్య తగాదాలు ఉంటే కూర్చొని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో రానున్న ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో ఉన్న ఐరన్ పరిశ్రమలను గ్రామాలకు దూరంగా తరలించాలని తీర్పు ఇవ్వడంపై న్యాయవాది వీరేందర్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, శ్రీధర్‌రెడ్డి, గిరియాదవ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏపీఎం భగవంతు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

షాద్‌నగర్: విప్లవకారుడు భగత్‌సింగ్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతిని ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు

ఆశయసాధనకు కృషి చేయాలి

షాద్‌నగర్‌రూరల్: భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా టీఎస్‌యూటీఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నర్సింలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు,

రాజీమార్గమే రాజమార్గం

సీనియర్ జడ్జి దశరథరామయ్య



కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి దశరథరామయ్య

చేవెళ్ల: కోర్టులలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ లను ప్రవేశపెట్టినట్లు చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి దశరథరామయ్య అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో శనివారం దశరథరామయ్య, జూనియర్ జడ్జి కిరణ్‌కుమార్, రిటైర్డ్ సాంబశివరావు ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ లోక్ అదాలత్‌లో మొత్తం మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులు 461 కేసులు పరిష్కరించడంతో పాటు జరిమానాగా రూ.12.39లక్షలు విధించినట్లు స్పష్టం చేశారు. రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పెండింగ్ కేసులు ఉన్న కక్షిదారులు ఇరువర్గాలు రాజీ మార్గంతో లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే వారి కేసులు పూర్తిగా పరిష్కారమవుతాయని చెప్పారు. 6 రోజులుగా ట్రాఫిక్ పోలీసుల కేసులకు సంబంధించి నిర్వహిస్తున్న ఈ లోక్‌అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ కిషన్, సీఐలు భూపాల్‌శ్రీధర్, వెంకటేశం, అరవింద్‌కిరణ్, చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు గౌతమ్‌రెడ్డి, సత్యానందం, కుమార్, మల్లేశ్‌గౌడ్, రామకృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో చెత్త తొలగింపు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శి నిర్వహించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, డీఎల్‌పీఓ సతీశ్ రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఉన్న నీటికుంటను చూసి ఆశ్చర్యపోయారు. దీనిని వెంటనే శుభ్రం చేయాలని తెలపడంతో పంచాయతీ అధికారి శనివారం సిబ్బంది, కూలీలతో శుభ్రం చేయించారు. శివాలయం పక్కనే ఉన్న ఈ మంచినీటి కుంటలో గణేశ్ నిమజ్జనం చేయడంతో గణేషుడి వద్ద ఉన్న పూలదండలు, మామిడికొమ్మలు, ఇతర అన్ని సామగ్రి దీంట్లో చేరడంతో వ్యర్థాలుగా ఏర్పడ్డాయన్నారు. వీటిని శుభ్రం చేసేందుకు కార్మికులతో పాటు కూలీలను ఏర్పాటు చేసి తొలగించామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ట్రాక్టర్ డోజర్ సహకారంతో నీటికుంట చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేయించామన్నారు. గణేశ్ విగ్రహాలను ఇందులో వేయడంతోనే ఇలా ఏర్పడిందని తెలిపారు. అదేవిధంగా పల్లె వనంలో పిచ్చిమొక్కలు తొలగించామని సూచించారు. కేతిరెడ్డిపల్లికి అధికారులు రాకతో శివాలయం నీటి కుంట శుభ్రం అయిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నీటికుంటలో చెత్త, పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్మికులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజలకు ఎన్నో ఉచిత హామీలను ఇచ్చి, ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. అధికారంలో వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో హంగామా చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం వికసిత్ భారత్ కోసం కృషి చేస్తోందన్నారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. వికసిత్ భారత్‌లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అగ్గి ప్రవీణ్, సురేశ్, నర్సింహ, గిరి, మహేశ్, ఆనంద్‌కుమార్, బాబు, నర్సింలు, అంజయ్య, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: పార్టీ సభ్యత్వ నమోదులో శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు

గ్రామాల్లో పార్టీని బలోపేతం చేద్దాం

కొందుర్గు: గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు అభియాన్ కో–కన్వీనర్ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెంకిర్యాల గ్రామంలో సభ్యత్వ ప్రముఖ్ లక్ష్మికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతీ గడపకు తీసుకెళ్లాలని, నరేంద్ర మోదీ పథకాలను అందరికి వివరించాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాటం రాజు, చందు, రామకృష్ణ, రాజు, రఘు, దేవేందర్, శివ, కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు వృద్ధుల సాయం

షాబాద్: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకుండా వృద్ధులు రోడ్డు బాగుకోసం నడుం బిగించినట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామానికి చెందిన వృద్ధులు ఆసరా పెన్షన్ తీసుకున్న సుమారు 100 మంది ఒక్కొక్కరు రూ.20 రూపాయల చొప్పున కార్యదర్శికి రూ. 2వేల రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్–చేవెళ్ల హైవే మీద ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలను బాగు చేసేందుకు ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వాలు మారిన రహదారుల పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



గుంతలను పూడ్చివేయిస్తున్న కార్యదర్శి

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎంఈఓ వెంకటయ్య

మొయినాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఎస్‌జీఎఫ్ రాజేంద్రనగర్ జోనల్‌స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకే విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వందజట్లు హాజరయ్యాయి. వివిధ జట్ల మధ్య పోటీలు జరిగాయి. అండర్–17 బాలుర విభాగం, అండర్–17 బాలికల విభాగం, అండర్–14 బాలుర విభాగంలో విజయం సాధించిన జట్లకు అధికారులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ గాంగ్యానాయక్, మాజీ ఎంపీటీసీ గణేశ్‌గౌడ్, ఎంఎన్ఓ మల్లయ్య, ఎస్‌టీయూ ఇల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జీహెచ్‌ఎం నర్సింలు, టీజీపీఈటీఏ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు బాలస్వామిరెడ్డి, యాదయ్య, తిరపతయ్య, రామకృష్ణ, జ్యోతి, నీరజ, నాయకులు నర్సింహారెడ్డి, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు